క్లుప్తంగా

రైల్వేకోడూరు వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్



వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ వెంకటేశ్వరరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడుకు చెందిన తమ్మినేని వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతూ అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో కుమారుడి వద్దకు వెళ్లింది. వలంటీర్ మద్దుల వెంకటేశ్వరరెడ్డి అక్కడికి వెళ్లి రూ.2750 పింఛన్ నగదు పంపిణీ చేశాడు. అనారోగ్య కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వృద్ధులకు వారు నివశిస్తున్న ప్రాంతాలకే వెళ్లి పింఛన్ అందిస్తుండంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన వెంకటయ్య తాత ఆరాధన

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువులో మూడు రోజుల నుంచి వెంకటయ్య తాత ఆరాధనకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం వెంకటయ్య తాతకు గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించారు. వెంకటయ్య తాత కుటుంబీకులు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

యర్రగొండపాలెం: బంగాళఖాతంలో ఏర్పడిన తుఫాన్‌తో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ వర్షాలతో ఉద్యాన పంటలు దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి పలు సూచనలు చేశారు. చీని, నిమ్మ తోటల్లో చెట్ల పాదుల్లో నిలిచి ఉన్న నీటిని తీసివేసి పాదులను తేలికగా తవ్వి వేరు వ్యవస్థకు గాలి అందేవిధంగా చూడాలని, తోటల చుట్టూ వాలుకు 3–4 అడుగుల లోతు కందకాలు తవ్వి నిలిచి ఉన్న నీటిని బయటకు పంపాలని, వాలిపోయిన చెట్లను నిటారుగా నిలబెట్టి ఊతమివ్వాలని, ఒక వేళ వేరు వ్యవస్థ బయటకు కనిపిస్తే మట్టితో కప్పాలని సూచించారు.

నూతన కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం రమేష్‌బాబు

మార్కాపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో కమ్యూనిటీ కాంట్రాక్టు పనులను నిర్వహించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ, ఏపీఎం రమేష్‌బాబు అన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలుతీసుకుందన్నారు. ఎల్‌సీ నాగభూషణం, సీసీలు మనోకుమారి, స్వామి పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాల సేకరణ



విరాళం అందిస్తున్న సీఐ రాజేష్

కంభం: మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. సీఐ రాజేష్‌కుమార్, ఎస్సై పులి రాజేష్ విరాళం అందజేసారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో మాజీ సైనికులు బాధ్యతగా నడుచుకుంటూ ప్రజలకు తమవంతు సేవలందిస్తున్నారన్నారు. మాజీ సైనికులు వేణుగోపాల్, సంకతాల ప్రసాద్, వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి, మస్తాన్, స్వామికుమార్, సుంకరి సాయి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామి పటానికి నమస్కరిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

దర్శి: స్థానిక పొదిలి రోడ్డులోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నివాసంలో శనివారం రాత్రి శ్రీ అయ్యప్పస్వామి పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పూజా మందిరంలో అయ్యప్పస్వామి చిత్రపటాలు వుంచి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో అయ్యప్ప స్వామి మాలధారణస్వాములందరూ ఒకే పీఠం వద్దకు రావటంతో వెంకాయమ్మ ఇల్లు దేవాలయంలా మారిపోయింది. కార్యక్రమంలో దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సతీసమేతంగా హాజరై పూజలో పాల్గొన్నారు. అయ్యప్పస్వామి మాలధారణ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. మామూలు వారికి అన్నసంతర్పణ చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి



తర్లుపాడులో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్

గిద్దలూరు రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నూతన ఓటరుగా నమోదు కావాలని గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ రామకృష్ణయ్య అన్నారు. గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో డిసెంబర్ 2వ తేదీ, 3వ తేదీల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ప్రజాస్వామ్యంతో మనకు ఓటు ఒక వజ్రాయుధం లాంటిదని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌లెవల్ అధికారులు ఉండి దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలని తెలియజేశారు. ఎన్నికల పర్యవేక్షకులు ఆశిష్‌కుమార్, టపావలి, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: మండలంలోని మూగచింతలలోని 208 పోలింగ్ బూత్‌ను శనివారం తహశీల్దారు సి.హెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి బీఎల్‌వో రాజేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఐ కిలారి సుబ్బారావు ఉన్నారు.

మార్కాపురం: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరూ సమీపంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటరు దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎలక్షన్ కంట్రోల్ రూము పోల్ ఆఫ్ కాంటాక్టు ఇన్‌చార్జి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర కోరారు. శనివారం ఆయన పోలింగ్ స్టేషన్ల వారీగా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. 41, 42 పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జిలు ఉత్తమ్, వెంకటరెడ్డి ఉన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉండకూడదు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన ఎన్నికల స్పెషల్ కాంపెయిన్ డే కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ సేదు మాధవన్ శనివారం తనిఖీ చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ఓట్ల చేర్పులు, మార్పుల గురించి తహసీల్దార్ అబ్దుల్ హమీద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ పంపిణీని పరిశీలించారు. వీఆర్‌ఓ భాస్కర్ రెడ్డి, సిబ్బంది, చెన్నయ్య, రంగారావు, రవి తదితరులు ఉన్నారు.



ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న రవిచంద్ర

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సాయికుమార్



తాళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పుల్లలచెరువు: బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించి నిర్మూలనకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో సాయికుమార్ అన్నారు. శనివారం పుల్లలచెరువులో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు రక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరిలో అవగాహ కల్పించా వాటితో కలిగే పరిమాణాలను వివరించాలన్నారు. జెండర్ ఆధారిత వివక్ష నిర్మూలనే ధ్యేయంగా మహిళలు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ శరత్‌బాబు, ఏపీఎం వెంకటయ్య పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): బాల్య వివాహాలను అరికట్టడంలో మహిళలు ప్రధాన పాత్ర పోషించాలని ఏపీఎం దేవరాజ్ తెలిపారు. శనివారం బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండలంలో ఎక్కడైనా బాల్య వివాహం చేస్తున్నట్లు గుర్తిస్తే తక్షణమే కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి పెళ్లి జరగకుండా అరికట్టాలన్నారు. ప్రతి గ్రామంలో జండర్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జల జీవన్ మిషన్ పనులు చేసేందుకు గ్రామ జల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దు

మార్కాపురం టౌన్: బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి నిషేధించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్ బాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో జెండర్ సమావేశం, ర్యాలీని నిర్వహించారు. సీసీలు మనోకుమారి, స్వామి, ఎల్‌సీ నాగభూషణం, స్త్రీనిధి మేనేజర్ సులోచన, సిబ్బంది, వీవోఏలు సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి మద్దతుగా నిలవాలి



త్రిపురాంతకం: మిరియంపల్లిలో..

త్రిపురాంతకం: ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం మద్దతుగా నిలవాలని సచివాలయ మండల కన్వీనర్ చల్లా యల్లారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిరియంపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లకుండా స్థానికంగా అవసరాలు తీర్చే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు అందుబాటులో వలంటీర్లు సేవలందిస్తున్నారని యల్లారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ ఎస్.సుబ్బారావు, పార్టీ నాయకుల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సుబ్బారావు, ఎంపీడీఓ సాంబశివరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



పురుగుమందు డబ్బాలను పరిశీలిస్తున్న ఏడీ రమాదేవీ, ఏఓ శ్రీనివాసులు

పొదిలి: పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ శనివారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలన్నారు

మార్కాపురం: ర్కాపురం సబ్‌డివిజన్‌లో ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు నిర్దేశించిన ధరకంటే అధిక ధరకు ఎరువులు, పురుగుమందులు అమ్మితే షాపు యజమానులపై కేసులు నమోదుచేస్తామని ఏడీఏ రమాదేవీ హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆమె పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలను ఏఓ శ్రీనివాసరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగుమందులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి



రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్

మార్కాపురం: పట్టణంలో రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలని ఎండీయూలను సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో పలు ఎండీయూ వాహనాలను తనిఖీ చేసి రేషన్ పంపిణీని పరిశీలించారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందించే నిత్యావసర వస్తువులను ఇంటింటికీ సక్రమంగా అందించాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ మంజునాథ రెడ్డి, ఎన్‌ఫోర్సుమెంట్ డీజీ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బెదిరింపులపై కేసు నమోదు

మార్కాపురం రూరల్: బెదిరింపులపై కేసు నమోదైంది. తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాక తనను బెదిరించారని మండలంలోని గోగులదిన్నె గ్రామానికి చెందిన శివారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై మార్కాపురం పట్టణానికి చెందిన సిరాజ్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

కొనకనమిట్ల: కొందరు అధికారులు విధులకు దుమ్మా కొడుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రేగుమానిపల్లి సచివాలయాన్ని సందర్శించగా వీఆర్‌ఓ శ్రీకాంత్ తరచూ విధులకు దుమ్మా కొడుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైందన్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా పలువురు సభ్యులు అధికారుల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.

సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు



సర్పంచ్‌కు నియామకపత్రం అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

త్రిపురాంతకం: మండలంలోని కొత్త అన్నసముద్రం గ్రామ సర్పంచ్‌గా కంచుపాటి వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు. వెంకటేశ్వర్లుకు నియామక పత్రాన్ని ఎంపీడీఓ సాంబశివరావు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి అందజేసారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, మహిళా నాయకురాలు సరళ పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఈఈ దాశరథి శర్మ సత్కారం



దాశరథి శర్మను సన్మానిస్తున్న డీఈలు, ఏఈలు

మార్కాపురం: డివిజన్ పరిధిలో నూతన గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని డీఈ, ఏఈలను ఈఈ దాశరథి శర్మ కోరారు. శనివారం గృహ నిర్మాణశాఖ ఈఈగా బాధ్యతలు స్వీకరించిన సందర్భముగా ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఈఈగా డి. పవన్‌కుమార్ వ్యవహరించారు. నూతన ఈఈ దాశరథి శర్మను గిద్దలూరు, వై. పాలెం, మార్కాపురం డీఈలు ఖదీర్ బాషా, సురేష్, పవన్‌కుమార్, ఏఈ సాయిచందు సన్మానించారు.

వరి పంటను కోయవద్దు

కొమరోలు: తుఫాన్ ప్రభావం ఉన్న కారణంగా వరి పంట వేసిన రైతులు వారం రోజులపాటు కోతలు కోయవద్దని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాజశ్రీ సూచించారు. డిసెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు తుఫాన్ ప్రభావం ఉన్నందున కోతలు ఆపాలని రైతులకు సూచించారు. శనగ వేసే రైతులు వారం రోజుల తర్వాత విత్తనం వేసుకోవాలని తెలిపారు. పంట పొలాల్లో మురుగు లేకుండా కాలువలు చేసుకోవాలని సూచించారు.

ముందస్తు దివ్యాంగుల దినోత్సవం



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ కిశోర్, మెడికల్ సిబ్బంది

మార్కాపురం రూరల్: డిసెంబరు 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లా వైద్యశాలలో ముందస్తు వేడుకలను సూపరింటెండెంట్ ఎస్. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అవయవాల లోపంతో జన్మించినవారు కొన్ని రంగాల్లో వెనుకబడి నిరుత్సాహంగా అసంతృప్తితో జీవితం సాగిస్తుంటారన్నారు. అలాంటి అంగవైకల్యం కలవారికి పునరావాసకేంద్రాన్ని కేంద్రం నిధులతో వైద్యశాలలో సీనియర్ స్టాఫ్ గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది కిశోర్, యశ్వంత్, శ్రీహరిరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

అర్ధవీడు (కంభం): మండలంలోని పెద్దకందుకూరు, అయ్యవారిపల్లి గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఉజ్వల పథకంలో ఐదుగురు లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ వెంకట్రావు, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, సర్పంచులు చేగిరెడ్డి రాజేశ్వరి, హైమావతి, ఎంపీటీసీ అనంతరాములు, డాక్టర్ జవహర్, ఏపీఎం రామయోగయ్య, పాల్గొన్నారు.

సోక్‌పిట్‌లు గుర్తించాలి

మార్కాపురం రూరల్: మండలంలోని భూపతిపల్లిలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం ఎంపీడీఓ తోట చందన హాజరై మాట్లాడుతూ రాములవాగు వద్ద చెక్ డ్యాములు, చెక్‌డ్యాముల మరమ్మతులు కమ్యూనిటీ సోక్‌పిట్‌లను తదితర పనులను గ్రామస్తులు గుర్తించి తెలియచేయాలని కోరారు. సర్పంచ్ మున్నంగి కోటేశ్వరీ, ఏపీఎం జీవరత్నం, టీఏ, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

భూమి సంపూర్ణ హక్కు పత్రాల పంపిణీ

గిద్దలూరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసైన్‌మెంట్ భూమిపై 20 సంవత్సరాల నుంచి అనుభవంలో ఉండే వారికి సంపూర్ణ భూ హక్కు పత్రాలను తహసీల్దార్ సీతారామయ్య చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు మండలంలోని 7 గ్రామాలకు చెందిన 58 మంది రైతులకు 126.555 ఎకరాల విస్తీర్ణం కలిగిన వ్యవసాయ భూమికి సంపూర్ణ భూహక్కు పత్రాలను పొందినట్లు ఆయన తెలిపారు. 20 సంవత్సరాలు అనుభవంలో ఉండి సాగు చేసుకుంటున్న డీకేటీ పట్టా ఉన్న రైతుల శ్రేయస్సు, అర్థిక వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం యాక్ట్ నంబర్ 35 ఆఫ్ 2023 ప్రకారం కొనుగోలు, అమ్మకాలు జరిగేలా ప్రభుత్వం సవరణ చేసినట్లు ఆయన వివరించారు. ఎంపీపీ లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ వంశీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ ఉన్నారు.



మాదాలవారిపాలెంలో ప్రభపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

పొదిలి రూరల్: అభివృద్ధి, సంక్షేమం సమపాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. శుక్రవారం మాదాలవారిపాలెంలో నాసర్ మహమ్మద్‌వలి గంధమహోత్సవం తిరునాళ్లలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి పాల్గొన్నారు. రూ. 500 కోట్లతో మెడికల్ కాలేజీ, ఆరోగ్య కేంద్రం, కొనకనమిట్లలో కొత్తగా పీహెచ్‌సీ నిర్మాణం, పొదిలిలో రూ..50 కోట్లతో సమ్మర్‌స్టోరేజీ పనులు చేపట్టామన్నారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొదిలి, కొనకనమిట్ల మండల, పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మోరా శంకర్ రెడ్డి, అనికాళ్ళ ఈశ్వర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పెమ్మని ఓంకార్, పులిగొర్ల శ్రీనివాసులు, కామునూరి వెంకట్రావు, ఏడు కొండలు పాల్గొన్నారు.

ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే



మాట్లాడుతున్న చెన్నారెడ్డి

కంభం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం మధ్యాహ్నం పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం మండలంలో విజయవంతంగా పూర్తయిందని, ప్రతి గ్రామంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేశారన్నారు. రాజకీయాలు, కుల మతాలతో సంబంధం లేకుండా అర్హతే కొలమానంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. గతంలో ఏ చిన్న పని జరగాలన్నా జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఉండేదని, ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉంటే సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు వలంటీర్లు గడప వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారన్నారు. మండలంలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సర్పంచులకు, ఎంపీటీసీలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఉప సర్పంచి సయ్యద్ ఖాసిం, ఎంపీటీసీ నాగరాజు, పార్టీ నాయకులు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీను, హుస్సేన్‌బాషా, చెన్నకృష్ణారెడ్డి, హుస్సేన్‌బాషా, రసూల్, జాకీర్ పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

దర్శి: స్థానిక శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప, సకల దీక్షా స్వాములకు శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నదానం చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వాములకు బూచేపల్లి కుటుంబ సభ్యులందరూ స్వయంగా వడ్డించారు. ఆలయం సిబ్బంది వారికి పూర్ణ కుంభంతో వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలి



సీఈఓ జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన మహిళలు

ముండ్లమూరు: గ్రామాభివృద్ధి పనుల్లో మహిళలు భాగస్వాములు కావాలని వైఎస్సార్ కేపీ దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో శనివారం సెర్ప్ సీఈఓ జూమ్ కాన్ఫరెన్స్ అనంతరం గ్రామ సంఘ ప్రతినిధులు, వీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు చేసే బాధ్యతలను ఆశక్తి గల మహిళా సంఘాల ప్రతినిధులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇప్పటికే పనులు మంజూరైన గ్రామాల్లో పనులు చేసే బాధ్యతలను మహిళలు తీసుకోవాలన్నారు. వారికి ప్రాజెక్టు నుంచి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. ఆడిట్ పూర్తి చేసి రిటర్న్స్ వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సీసీలు, గ్రామ సంఘ ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ షెహ్బాజ్ అహ్మద్

మార్కాపురం టౌన్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామనీ ట్రైనీ డీఎస్పీ షెహ్బాజ్ అహమ్మద్ అన్నారు. శనివారం జార్జి ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడితేనే అనుకున్న ఉద్యోగాలను సాధిస్తారని, ర్యాగింగ్ చేసి కేసులు నమోదైతే ఉద్యోగాలు రావన్నారు. ప్రిన్సిపాల్ జయరావు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ క్యాన్‌ల పంపిణీ

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్‌కు పాఠశాల పూర్వ విద్యార్థులు వాటర్ క్యాన్‌లను శనివారం పంపిణీ చేశారు. 1992–93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పి.బాలయ్య, ఎస్. శివశంకర్‌రెడ్డిలు మిత్రుల సహకారంతో 13 కూలింగ్ వాటర్‌క్యాన్‌లను అందచేశారు. సర్పంచ్ నర్రా రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లెల శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం ఎస్ భాస్కర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-పంటను నమోదు చేసుకోవాలి

కొమరోలు: రబీ సీజన్‌లో పంట వేసిన ప్రతి ఒక్క రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాజశ్రీ తెలిపారు. మండలంలోని రాజుపాలెంలో శనివారం ఈ-పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, పంట ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ వంటి ప్రభుత్వ పథకాలు ఈ-పంట నమోదు చేసుకుంటే వర్తిస్తాయన్నారు. సోమవారం నుంచి అన్ని భరోసా కేంద్రాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.